# స్వాతంత్ర్యానంతరం కేంద్ర బ్యాంకు ద్రవ్య విధానం

**పేపర్ - 3, సెక్షన్ - 1**

**యూనిట్ - 4**



**Q స్వాతంత్ర్యానంతరం కేంద్ర బ్యాంకు అవలంబించిన ద్రవ్య విధానాన్ని వివరించండి?**

**A** భారత్‌లో పంచవర్ష ప్రణాళికలు, స్థూల ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా లక్ష్యాల సాధన నేపథ్యంలో ద్రవ్య విధానంలో మార్పులు సంభవించాయి. పొదుపు సమీకరణ, వివిధ రంగాల్లో వనరుల పంపిణీ సక్రమంగా జరిగేలా స్వాతంత్ర్యానంతరం కేంద్ర బ్యాంకు అవలంబించిన ద్రవ్య విధానం తోడ్పడింది. ధరల స్థిరత్వం సాధించడంతోపాటు, జాతీయ కరెన్సీ స్థిరత్వం, ఉపాధివృద్ధి, ఆదాయవృద్ధిపై ద్రవ్య విధానం దృష్టి కేంద్రీకరించింది.

1951 నుంచి 1972 మధ్యలో పరిశ్రమలు, వాణిజ్య రంగానికి అవసరమైన పరపతి అందించడం ద్వారా అనుత్పాదక, అంచనా వ్యాపార నిమిత్తం పరపతి తగ్గించే చర్యల్లో భాగంగా నియంత్రణతో కూడిన విస్తరణ (controlled expansion) విధానాన్ని కేంద్ర బ్యాంకు అమలు చేసింది. 1972-91 మధ్య ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి 'కఠిన ద్రవ్య విధానాన్ని' అవలంబించింది. కోశ విధానాల రెస్పాన్స్‌కు అనుగుణంగా ద్రవ్య విధానాన్ని రూపొందించారు. 1970-80లలో ద్రవ్యలోటు పెరిగింది. ప్రభుత్వానికి కేంద్రబ్యాంకు అధిక పరపతి ఇచ్చిన కారణంగా దేశంలో ద్రవ్య సప్లయ్ పెరిగింది. ఈనేపథ్యంలో ద్రవ్య విధానం ద్వారా కేంద్రబ్యాంకు ద్రవ్యోల్బణ ప్రభావాన్ని నియంత్రించడానికి కృషి చేసింది.

1991 తర్వాత ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ద్రవ్యలోటు తగ్గించడానికి ద్రవ్య విధానం తోడ్పడింది. 1995 వరకు ధరల స్థిరత్వం సాధించే దిశగా ద్రవ్య విధానాన్ని రూపొందించగా తర్వాత కాలంలో అధిక వృద్ధి సాధన దిశగా ద్రవ్య విధానాన్ని కేంద్రబ్యాంకు అమలు చేసింది. 1999 తర్వాత ద్రవ్య విధాన ప్రభావం ఆర్థిక వ్యవస్థ అధిక వృద్ధి దిశగా పయనించడానికి దోహదం చేసింది. 2007 తర్వాత ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతోపాటు భారత్‌లో కూడా కొన్ని రంగాలపై సంక్షోభ ప్రభావం కనిపించింది. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గుదల, ఎగుమతుల రాబడిలో తగ్గుదల, సేవా కార్యకలపాల తగ్గుదల, కార్పోరేటు రంగంలో మార్జిన్‌లు తగ్గడం, వ్యాపారంపై విశ్వాసం తగ్గడం వంటి స్థితి దేశంలో కనిపించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 2008లో 'డాలర్ లిక్విడిటీ'ని అవసరమైన మేరకు నిర్వహించడం ద్వారా ఉత్పాదక రంగాలకు పరపతి పెంచే విధంగా కేంద్రబ్యాంకు ద్రవ్య విధానాన్ని ప్రకటించింది. విత్త మార్కెట్ల పనితీరు సక్రమంగా ఉండటం, గ్రామీణ డిమాండ్‌లో పెరుగుదల, విదేశీ మారక నిల్వలు ఎక్కువగా ఉండటం వంటి చర్యలు ఆర్థిక సంక్షోభాన్నుంచి భారత్ గట్టెక్కడానికి దోహదం చేశాయి. ఆకాలంలో రెపోరేటును 4.75 శాతానికి తగ్గించడం, రివర్స్ రెపో రేటును 3.25 శాతానికి తగ్గించడం, నగదు - నిల్వల నిష్పత్తిని 5 శాతంగా ఉంచడం ద్వారా కేంద్రబ్యాంకు అవలంబించిన ద్రవ్య విధానం ఆర్థిక వ్యవస్థ పురోగ మన దిశగా పయనించడానికి తోడ్పడింది. ప్రపంచ వస్తుధరల ధోరణి, స్వదేశీ డిమాండ్, సప్లయ్ ధోరణులను దృష్టిలో ఉంచుకొని మార్చి 2010 నాటికి టోకు ధరల సూచీ 4 శాతంగా ప్రతిపాదించింది.

మార్చి5, 2011 నాటికి ఆహార ద్రవ్యోల్బణం 9.42 శాతంగా నమోదైంది. ఈ క్రమంలో కేంద్రబ్యాంకు తన ద్రవ్య విధానంలో భాగంగా రెపోరేటు, రివర్స్ రెపోరేటులను పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం రేటును రెండోసారి సవరిస్తూ మార్చి 2011 నాటికి ద్రవ్యోల్బణం 8 శాతంగా అంచనా వేసింది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే చర్యల్లో భాగంగా రెపోరేటును 6.75 శాతం, రివర్స్ రెపోరేటును 5.75 శాతంగా నిర్ణయించింది. ఈ చర్యల వల్ల ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యత్వం తగ్గి ద్రవ్యోల్బణం నియంత్రణ జరుగుతుంది.

**Q పరపతి నియంత్రణలో భాగంగా ముఖ్య సాధనాలైన నగదు-నిల్వల నిష్పత్తి, ఎస్ఎల్ఆర్, బ్యాంకు రేటు ధోరణులను వివరించండి?**

**A** కేంద్రబ్యాంకు పరపతి నియంత్రణకు పరిమాణాత్మక, గుణాత్మక లేక విచక్షణాత్మక పరపతి సాధనాలను వినియోగిస్తుంది. ద్రవ్య సప్లయ్ పెరిగినపుడు ఏర్పడే ద్రవ్యోల్బణ స్థితిని, ద్రవ్య సప్లయ్ తగ్గినపుడు ఏర్పడే ప్రతి ద్రవ్యోల్బణ స్థితిని వారించడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో సమతౌల్యం సాధించడానికి కేంద్రబ్యాంకు ద్రవ్య విధానం తోడ్పడుతుంది. పరిమాణాత్మక సాధనాలుగా బ్యాంకు రేటు, బహిరంగ మార్కెట్ చర్యలు, నగదు నిల్వల నిష్పత్తి, ఎస్ఎల్ఆర్, రెపోరేటులను పరపతి నియంత్రణకు కేంద్రబ్యాంకు వినియోగిస్తుంది. గుణాత్మక లేక విచక్షణాత్మక సాధనాలుగా మార్జిన్ అవసరాలు, వినియోగదారుని పరపతి నియంత్రణ, పరపతి రేషనింగ్, ప్రత్యక్ష చర్య, నైతికోద్బోధ ఉపకరిస్తాయి.

1960 కి ముందు కాలంలో నగదు-నిల్వల నిష్పత్తిని కేంద్ర

బ్యాంకు 5 శాతంగా నిర్వహించింది. 1960-70 మధ్య దేశంలో మూడో సాధారణ ఎన్నికలు, 1962లో చైనా, 1965లో పాకిస్థాన్‌తో యుద్ధాల నేపథ్యంలో ఏర్పడిన పరిణామాల వల్ల నగదు నిల్వల నిష్పత్తిని 3 శాతానికి తగ్గించింది. తిరిగి 1973లో 7 శాతానికి పెంచి 1974లో 5 శాతానికి, 1975లో 4.5 శాతానికి తగ్గించింది. ప్రభుత్వం కేంద్రబ్యాంకు వద్ద ఎక్కువ రుణం తీసుకున్న నేపథ్యంలో ఏర్పడిన పరిస్థితులను అదుపు చేయడానికి తిరిగి 1975-80 మధ్య కాలంలో సీఆర్‌ఆర్‌ను 6 శాతంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో సంస్కరణలు ప్రారంభమైన తర్వాత 1994లో 15 శాతంగా ఉన్న సీఆర్‌ఆర్ 2003 తర్వాత స్థిరంగా 5 శాతంగా ఉంది. 2007లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో సీఆర్‌ఆర్‌ను 8 శాతానికి కేంద్రబ్యాంకు పెంచింది. నగదు నిల్వల నిష్పత్తిని పెంచినందువల్ల వాణిజ్య బ్యాంకులు తమ డిపాజిట్లలో ఎక్కువభాగం కేంద్రబ్యాంకు వద్ద నిర్వహించాల్సి రావడంతో ఆర్థిక వ్యవస్థలో చలామణిలో ఉన్న ద్రవ్య పరిమాణం తగ్గుతుంది. ఆర్థిక వ్యవస్థలో తిరోగమనం నుంచి రికవరీ అయిన నేపథ్యంలో 2010 లో సీఆర్‌ఆర్‌ను 6 శాతంగా కేంద్రబ్యాంకు నిర్ణయించింది. 2010లో దేశంలో ఏర్పడిన ద్రవ్యోల్బణ స్థితిని నివారించే క్రమంలో నగదు-నిల్వల నిష్పత్తిని 6.75 శాతంగా నిర్ణయించారు.

ఎస్ఎల్ఆర్‌ను 40 శాతం వరకు పెంచగలిగే అవకాశం కేంద్రబ్యాంకుకు ఉంది. 1950-60లలో ఎస్ఎల్ఆర్‌ను కేంద్ర బ్యాంకు 20 శాతంగా నిర్ణయించగా పంచవర్ష ప్రణాళికల్లో పలు కార్యక్రమాల అమలుకు ప్రభుత్వానికి రుణ సౌకర్యం పెంపొందించే ఉద్దేశంతో ఎస్ఎల్ఆర్‌ను 1961లో 25 శాతం పెంచుతూ 1980లో 35-37 శాతంగా 1990 ప్రారంభంలో 37-38 శాతంగా ఎస్ఎల్ఆర్‌ను నిర్ణయించింది. ఎస్ఎల్ఆర్ అధికంగా ఉన్నందువల్ల బ్యాంకుల పరపతి - డిపాజిట్ల నిష్పత్తి తగ్గింది. బ్యాకింగ్ రంగ సంస్కరణలపై ఏర్పాటైన నరసింహం కమిటీ ఎస్ఎల్ఆర్‌ను దశల వారీగా తగ్గించమని సిఫార్సు చేసిన నేపథ్యంలో 1996లో ఉన్న 31 శాతం ఎస్ఎల్ఆర్‌ను 1997 నాటికి 25 శాతానికి తగ్గించి ఇప్పటి వరకు అదే నిష్పత్తిని కేంద్ర బ్యాంకు కొనసాగిస్తుంది.

కేంద్రబ్యాంకు వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటును బ్యాంకు రేటు అంటారు. 1956లో బ్యాంకు రేటు 3.5 శాతంకాగా తర్వాత కాలంలో క్రమంగా పెరుగుతూ 1970లలో 9 శాతానికి, 1980లలో 10 శాతానికి పెరిగింది. ఈ రెండు దశకాలలో దేశంలో ద్రవ్యోల్బణ స్థితిని అరికట్టే నేపథ్యంలో బ్యాంకు రేటును కేంద్రబ్యాంకు పెంచింది. 1991వ సంవత్సరంలో దేశంలో ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఏర్పడిన అధిక ద్రవ్యోల్బణం, చెల్లింపుల శేషంలోని అసమతౌల్యాన్ని నివారించే ప్రయత్నంలో కేంద్రబ్యాంకు రేటును 12 శాతానికి పెంచి తిరిగి 2000 సంవత్సరానికి 6 శాతానికి తగ్గించింది. ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని పెంపొందించే క్రమంలో, వివిధ ఉత్పాదక రంగాలకు పరపతిని పెంచే క్రమంలో బ్యాంకు రేటును 6 శాతంగా ఇటీవలి కాలం వరకు కేంద్రబ్యాంకు కొనసాగించింది.

**Q బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల ప్రగతిని తెలపండి?**

**A** బ్యాంకు చట్టబద్ధమైన నిర్వచనంతో సంబంధం లేకుండా బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించే విత్త సంస్థలను బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు అంటారు. అన్ని విధాలైన బ్యాంకింగ్ సేవలు అంటే రుణ పరపతి, ప్రైవేటు విద్యకు పరపతి, రిటైర్‌మెంట్ ప్లానింగ్, ద్రవ్య మార్కెట్‌లో ట్రేడింగ్, స్టాక్స్, షేర్ల అండర్ రైటింగ్ వంటి కార్యకలాపాలను ఈ సంస్థలు నిర్వహిస్తాయి. గత కొన్ని సంవత్సరాలుగా 'వెంచర్ క్యాపిటల్ కంపెనీలు'గాను, రిటైల్, పారిశ్రామిక కంపెనీలుగా ఎన్‌బీఎఫ్‌సీ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ)లు తమ కార్యకలాపాలను విస్తరించాయి.

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు కార్యకలాపాల స్వభావాన్ని బట్టి వాటిని-

1) డెవలప్‌మెంట్ ఫైనాన్స్ సంస్థలు 2) లీజింగ్ కంపెనీలు 3) పెట్టుబడి కంపెనీలు 4) మోడర్బ కంపెనీలు 5) గృహ ఫైనాన్స్ కంపెనీలు 6) వెంచర్ క్యాపిటల్ కంపెనీలు 7) డిస్కౌంట్, గ్యారంటీ హౌస్‌లుగా వర్గీకరించవచ్చు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934కు లోబడి కేంద్ర బ్యాంకు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను నియంత్రిస్తుంది.

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు పబ్లిక్ డిపాజిట్లు సేకరించరాదు. నిర్ధారిత సర్టిఫికేట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఉన్న కంపెనీలు మాత్రమే పబ్లిక్ డిపాజిట్లు తీసుకోవాలి. డిపాజిట్ల కనీస కాలపరిమితి 12 నెలలుగాను గరిష్ట కాలపరిమితి 60 నెలలుగాను ఉంటుంది. డిమాండ్‌పై వెంటనే చెల్లించే డిపాజిట్లను ఈ సంస్థలు అనుమతించకూడదు. కేంద్ర బ్యాంకు సూచించిన వడ్డీ రేటు కంటే ఎక్కువ వడ్డీని ఈ సంస్థలు వసూలు చేయకూడదు. ఈ సంస్థలు డిపాజిట్లపై చెల్లించే వడ్డీ సంవత్సరానికి 12.4 శాతం కాకుండా మరే ఇతర ప్రోత్సాహకాలను డిపాజిట్ దార్లకు ప్రకటించకూడదు. ఎన్‌బీఎఫ్‌సీలలో ఉన్న డిపాజిట్లకు ఎటువంటి బీమా సౌకర్యం ఉండదు. ఇవి తిరిగి చెల్లించాల్సిన డిపాజిట్లకు సంబంధించి కేంద్రబ్యాంకు ఎటువంటి హామీ ఇవ్వదు.

కేంద్ర బ్యాంకు వద్ద నమోదు అయిన ఎన్‌బీఎఫ్‌సీలు మొత్తం (డిపాజిట్లు అంగీకరించేవి, అంగీకరించనవి) జూన్ 2009లో 12740 కాగా అవి 2010 నాటికి 12630కి తగ్గాయి. సంస్కరణల కాలంలో వీటికి సంబంధించి అవలంబించిన నియంత్రణ విధానం వల్ల వీటి సంఖ్యలో తగ్గుదల సంభవించింది. డిపాజిట్లు స్వీకరించే ఎన్‌బీఎఫ్‌సీల సంఖ్య ఇదే కాలంలో 336 నుంచి 308 కి తగ్గింది. 2009-10లో డిపాజిట్లు స్వీకరించే ఎన్‌బీఎఫ్‌సీల ఆర్థిక ప్రగతి తగ్గడానికి వాటి ఆపరేటింగ్ ప్రాఫిట్ తగ్గడం కారణమైంది. వ్యయం-ఆదాయ నిష్పత్తి 2008-09లో 74శాతం కాగా 2009-10లో 81.8 శాతానికి పెరిగింది. సంస్కరణల కాలంలో ఎన్‌బీఎఫ్‌సీల రికవరీ కాని రుణాలు తగ్గాయి. మార్చి 2010 నాటికి 216 సంస్థలు (డిపాజిట్లు స్వీకరించే సంస్థలలో) క్యాపిటల్ ఎడిక్వసీ రేషియో 12 శాతం కన్నా ఎక్కువగా ఉంది.

**ముఖ్యాంశాలు:**

- కేంద్రబ్యాంకు పరపతి నియంత్రణకు పరిమాణాత్మక, గుణాత్మక లేక విచక్షణాత్మక పరపతి సాధానాలను వినియోగిస్తుంది.
- కేంద్రబ్యాంకు వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటును బ్యాంకు రేటు అంటారు.
- 1991 వరకు భారత్‌లో స్థిర వినిమయ రేటు అమల్లో ఉంది.
- దేశంలో ద్రవ్యోల్బణ స్థితిని నివారించడానికి కేంద్రబ్యాంకు బ్యాంక్ రేటు, రెపోరేటు, సీఆర్‌ఆర్‌లను పెంచుతుంది.
- 1951-72 మధ్య కాలంలో కేంద్ర బ్యాంకు 'నియంత్రణతో కూడుకున్న విస్తరణ ద్రవ్య విధానాన్ని' అవలంబించింది.
- 1972-1991 మధ్య కాలంలో కేంద్ర బ్యాంకు 'టైట్ మానిటరీ పాలసీ'ని అవలంబించింది.
- జూన్ 2010 నాటికి డిపాజిట్లు స్వీకరించే ఎన్‌బీఎఫ్‌సీల సంఖ్య 308.
- మార్చి5, 2011 నాటికి ఆహార ద్రవ్యోల్బణం 9.42 శాతంగా నమోదైంది. ఈ క్రమంలో కేంద్రబ్యాంకు తన ద్రవ్య విధానంలో భాగంగా రెపోరేటు, రివర్స్ రెపోరేటులను పెంచింది.
- ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని పెంపొందించే క్రమంలో, వివిధ ఉత్పాదక రంగాలకు పరపతిని పెంచే క్రమంలో బ్యాంకు రేటును 6 శాతంగా ఇటీవలి కాలం వరకు కేంద్రబ్యాంకు కొనసాగించింది.
- 1951 నుంచి 1972 మధ్యలో పరిశ్రమలు, వాణిజ్య రంగానికి అవసరమైన పరపతి అందించడం ద్వారా అనుత్పాదక, అంచనా వ్యాపార నిమిత్తం పరపతి తగ్గించే చర్యల్లో భాగంగా నియంత్రణతో కూడిన విస్తరణ (controlled expansion) విధానాన్ని కేంద్ర బ్యాంకు అమలు చేసింది.